క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

యర్రగొండపాలెం: గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం బుధవారం జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కె.ఓబుల్ రెడ్డి మంగళవారం తెలిపారు. స్థానిక సచివాలయం–2 పరిధిలోని ఇందిరా నగర్‌లో ఉదయం 7 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొంటారని, అనంతరం ఎస్‌బీఐ వీధిలో ఓ ప్రైవేటు ఐస్ పార్లర్‌ను మంత్రి ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు.

సస్పెన్షన్ ఉత్తర్వులపై స్టే

ముండ్లమూరు: స్థానిక సచివాలయంలో పనిచేస్తున్న మహిళా శిశు సంరక్షణ కార్యదర్శి (జీఎంఎస్‌కే) శాంతి ప్రియ సస్పెన్షన్‌పై హైకోర్టు స్టే విధించింది. వివరాలు.. మహిళా శిశు సంరక్షణ కార్యదర్శి శాంతిప్రియ విధులకు యూనిఫాం లేకుండా హాజరు కావటం, పోలీస్ బందోబస్తు విధులు నిర్వహించటం లేదంటూ ఎస్‌ఐ సంపత్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఎస్పీ మలికాగర్గ్ ఏప్రిల్ 4న ఆమెను సస్పెండ్ చేశారు. ఆ ఉత్తర్వులపై ఆమె హైకోర్టును ఆశ్రయించారు. ఉత్తర్వులపై హైకోర్టు స్టే విధించింది. ఆమె యథావిధిగా సచివాలయంలో విధులకు హాజరు కావాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రాగి సాగు బహుళ ప్రయోజనం

తాళ్లూరు: రాగిని బరువు నేలలు, తేలిక రకం ఇసుక నేలల్లో సాగు చేయవచ్చని వ్యవసాయాధికారి ప్రసాదరావు అన్నారు. క్షేత్ర పర్యటనలో భాగంగా మంగళవారం తాళ్లూరులో సాగు చేసిన రాగిని ఆయన పరిశీలించారు. పైరులో రకాలు, సస్యరక్షణ చర్యలు వివరించారు.

సచివాలయం తనిఖీ

గిద్దలూరు రూరల్: నగర పంచాయతీ పరిధిలోని కోటగడ్డ సచివాలయాన్ని మంగళవారం కమిషనర్ వై.రామకృష్ణయ్య తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీసారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన అన్ని వివరాలు ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించాలని సూచించారు.

అక్రమ లేఔట్‌ల పరిశీలన

గిద్దలూరు రూరల్: కన్వర్షన్లు లేకుండా వేసిన లేఔట్లలో ప్లాట్లను అమ్మరాదు, కొనరాదని తహసీల్దార్ విజయకుమారి సూచించారు. పలు అనధికారిక లేఔట్లను మంగళవారం రెవెన్యూ సిబ్బందితో కలిసి ఆమె పరిశీలించారు. అనధికారిక లేఔట్లలో వేసిన ప్లాట్లను కొనుగోలు చేసినా, విక్రయించినా చట్టరీత్యా శిక్షార్హులవుతారని హెచ్చరించారు. ఆమెతో పాటు డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

గుండెపోటుతో ప్రయాణికుడి మృతి



ఆర్టీసీ బస్టాండ్‌లో వెంకటయ్య మృతదేహం

కొమరోలు: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఓ ప్రయాణికుడు గుండెపోటుతో మృతి చెందాడు. వివరాలు.. బేస్తవారపేట మండలం గలిజేరుగుళ్ల గ్రామానికి చెందిన వెంకటయ్య (70)కు ఆరోగ్యం బాగాలేకపోవడంతో తన భార్య తిరుపతమ్మతో గిద్దలూరు వైద్యశాలకు వెళ్లేందుకు తన స్వగ్రామంలో మంగళవారం ఉదయం ఆర్టీసీ బస్సు ఎక్కాడు. బస్సు కొమరోలు చేరే సరికి వెంకటయ్య బస్సులో కూర్చోలేక పోతుండటంతో కొమరోలులోని వైద్యశాలలో చూపించాలనే ఉద్దేశంతో తిరుపతమ్మ తన భర్త వెంకటయ్యను బస్సు నుంచి కిందకు దించింది. 2 నిమిషాల్లోనే ఆర్టీసీ బస్టాండ్‌లో వెంకటయ్య గుండెపోటుతో మృతి చెందాడు. తన బంధువుల సహకారంతో వెంకటయ్య మృతదేహాన్ని స్వగ్రామం గలిజేరుగుళ్ల గ్రామానికి తరలించారు.

నిధుల దుర్వినియోగంపై డీఎల్‌పీఓ నోటీసులు

తాళ్లూరు: మండలంలోని బెల్లంకొండవారిపాలెం పంచాయతీ పరిధిలో నిధుల దుర్వినియోగంపై గ్రామస్తుడు జీవీ శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు అధికారులు గతంలో విచారణ చేపట్టారు. ఆ మేరకు సర్పంచి, కార్యదర్శికి మంగళవారం నోటీసులు జారీ చేశారు. పంచాయితీరాజ్ చట్టం మేరకు సకాలంలో పంచాయతీ సమావేశాలు నిర్వహించక పోవటం, ఎంఎన్ఆర్ఈజీఎస్‌లో చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించక జాప్యం చేస్తున్నట్లు గుర్తించామని, అందుకు సంజాయిషీ కోరుతూ డీఎల్‌పీఓ నోటీసులు జారీ చేశారు.

హెచ్‌ఐవీ రోగులకు పౌష్టికాహారం పంపిణీ

చీరాల అర్బన్: చీరాల మహిళా మండలిలోని ఆశారేఖా మహిళా మండలి ఆధ్వర్యంలో మంగళవారం హెచ్‌ఐవీతో బాధపడుతున్న వారికి పౌష్టికాహారాన్ని అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీపీఎం రంగారావు పాల్గొన్నారు. వేసవిలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని, మందులు సక్రమంగా వాడుతూ మంచి ఆహార నియమాలను పాటించాలన్నారు. దాతల సహకారంతో 50 మందికి పౌష్టికాహారాన్ని అందించారు. కార్యక్రమంలో సీబీవో సభ్యులు పద్మావతి, ప్రెసిడెంట్ నాగేంద్రమ్మ, పీడీ శ్రీనివాస్, పీఎం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదంతో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేకు సంబంధం లేదు



మాట్లాడుతున్న ఎంపీపీ మురళి, పక్కన వైఎస్సార్ సీపీ నాయకులు

పొదిలి: కాట్రగుంట పశువుల బీడు భూ వివాదంతో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డికి ఎటువంటి సంబంధం లేదని కొనకనమిట్ల ఎంపీపీ ఎం.మురళి, జెడ్పీటీసీ సభ్యుడు ఎ.ఏడుకొండలు స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక సీసీకేఆర్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. 2014లో టీడీపీ హయాంలో తమ పూర్వీకుల ఆస్తిగా చెప్పుకుంటూ కొందరు రికార్డుల్లో నమోదు చేసుకున్నారన్నారు. విషయం ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే వద్దకు రావటంతో వారు కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్‌తో మాట్లాడి బాధిత రైతులకు న్యాయం చేయాలని కోరారన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా ఉండటంతో బాధిత రైతులు గొర్రెలను తహసీల్దార్ కార్యాలయంలోకి తోలి నిరసన వ్యక్తం చేయడం కూడా మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి సలహా మేరకేనన్నారు. తదుపరి వివాదం కోర్టుకు చేరిందన్నారు. బాధిత రైతుల పక్షాన ఉన్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలపై అనవసరంగా ఆరోపణలు చేయటం సరికాదన్నారు. ఆరోపణలు ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ మోరా శంకరరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు కామసాని వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పూర్వీకుల ఆస్తి కాబట్టే ఆన్‌లైన్ చేయించుకున్నాం :



పూర్వీకుల పేరున ఉన్న ఆస్తి కనుకనే తన భార్య, బంధువుల పేరున ఆన్‌లైన్ చేయించుకున్నట్లు యేదుబాటి వెంకటరావు అలియాస్ రావు చెప్పారు. 2014లో తెలుగుదేశం పార్టీ హయాంలోనే భూమి ఆన్‌లైన్ చేశారని తెలిపారు. ఇటీవల జరిగిన వ్యవహారంగా కొందరు మాట్లాడటం సరికాదని చెప్పారు. వ్యవహారం కోర్టులో ఉందని స్పష్టం చేశారు.

సమస్యల పరిష్కారానికే మీ గడపకు వచ్చా



పెద్దనాగులవరంలో లబ్ధిదారులకు పత్రాలు ఇస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి
- గడప గడపలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం

మార్కాపురం టౌన్: రాజకీయాలతో సంబంధం లేకుండా కుల, మత వర్గాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ నవరత్నాల పథకాలను అందిస్తున్నామని, అదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకత అని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం సాయంత్రం పట్టణంలోని కంభం రోడ్డులో వార్డు కౌన్సిలర్ దూదేకుల ప్రసాద్ పరిధిలోని వెంకటేశ్వర స్వామి గుడి, శివాజీ నగర్ 1, 2, 3 లైన్‌ల ప్రాంతాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి గడప గడపకు తిరిగి ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమ పథకాలను వివరించారు. సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం ప్రవేశపెట్టారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీకి అందరూ సంతోషంతో పూలు చల్లి, హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో వంద శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. దేశంలోనే గొప్ప సచివాలయ వ్యవస్థ, వలంటీర్లను ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరికీ అమ్మ ఒడి, ఆసరా తదితర పథకాలన్నీ అమలయ్యేలా చూస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. ప్రజలు చెప్పిన పలు సమస్యలను ఆయన ఓపికగా విని సంబంధిత శాఖాధికారులతో అక్కడికక్కడే మాట్లాడి కొన్నింటిని పరిష్కరించారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర కార్యదర్శి షంషీర్ అలీబేగ్, మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, కౌన్సిలర్లు ప్రసాద్, సలీం, బాను, షెక్షావలి, ఏఎంసీ చైర్మన్ జీ.శ్రీనివాసరెడ్డి, బుశ్శెట్టి నాగేశ్వరరావు, డీవీఆర్, బాబి, కరిముల్లా, నాలి కొండయ్య, పలువురు కౌన్సిలర్‌లు, నాయకులు పాల్గొన్నారు.

అవకాశాలు వినియోగించుకోవాలి



స్కిల్ హబ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న భరద్వాజ్

యర్రగొండపాలెం: ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి టి.భరద్వాజ్ కోరారు. మంగళవారం స్థానిక మోడల్ డిగ్రీ కళాశాలలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చదువుకొని ఖాళీగా ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులు స్కిల్ హబ్‌ద్వారా నైపుణ్యం పెంచుకొని ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలని కోరారు. జిల్లా నైపుణ్య అధికారి ఆర్.లోకనాథం మాట్లాడుతూ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లో రెండు కోర్సుల్లో శిక్షణ ఇప్పిస్తున్నామని, 30 మంది డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, 30 మంది సోలార్ ప్యానల్ టెక్నీషియన్‌లుగా శిక్షణ పొందుతున్నారని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతీ, యువకులకు స్కిల్ హబ్‌లో శిక్షణ ఇవ్వడంతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని, ప్రభుత్వం కల్పిస్తున్న ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ కుటుంబాలకు ఆసరాగా నిలువాలని విజ్ఞప్తి చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ జి.శ్రీధర్‌నాయుడు, స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ రమేష్ పాల్గొన్నారు.

దర్శి టౌన్: విద్యార్థులు, నిరుద్యోగులు ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వృత్తి నైపుణ్య శిక్షణను ఉపయోగించుకుని మంచి ఉద్యోగాలు పొంది ఆర్థికంగా స్థిరపడాలని వక్తలు కోరారు. దర్శి డిగ్రీ కళాశాలలో మంగళవారం స్కిల్ హబ్ ఏర్పాటు చేశారు. కోర్సులో డొమస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా 30 మంది, అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్స్‌గా 30 మందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. జిల్లా శిక్షణ నైపుణ్య అధికారి భరద్వాజ, నైపుణ్య అధికారి లోకనాథం, ప్రిన్సిపాల్ సావిత్రి, కో ఆర్డినేటర్ సురేష్ పాల్గొన్నారు.

హిందూ శ్మశాన వాటికకు విముక్తి కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామ పెద్దలు

పుల్లలచెరువు: పుల్లలచెరువులో కొందరి చేతితో ఆక్రమణలో ఉన్న హిందూ శ్మశాన వాటికకు విముక్తి కల్పించాలని తహసీల్దార్ దాసుకు మంగళవారం గ్రామ పెద్దలు వినతిపత్రం అందజేశారు. కొన్నేళ్ల క్రితం పుల్లలచెరువులో 665-1, 665-2లో కొంత భూమిని హిందు రుద్రభూమికి కేటాయించగా దాన్ని కొందరు ఆక్రమించుకోవడంతో హిందూ శ్మశాన వాటిక లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాలపై శ్మశాన వాటికను చూపడంతో పాటు దారి చూపాలని కోరారు. తహసీల్దార్ దాసు స్పందిస్తూ శ్మశానాలను ఆక్రమిస్తే తగిన చర్యలు తీసుకుంటామని, త్వరలోనే దాన్ని హిందువులకు అప్పగించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామ పెద్దలు గురునాథం, జానకి రఘు, కాశయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి ధ్వజ స్తంభం, శిఖర ప్రతిష్ట మహోత్సవాలు



పెద్దదోర్నాలలో వెలసిన విజయ గణపతి ఆలయం

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని గణేష్ నగర్‌లో వెలసిన విజయ గణపతి దేవస్థానంలో బుధవారం నుంచి విజయ గణపతి, ధ్వజ స్తంభ, శిఖర ప్రతిష్ట కార్యక్రమాలు జరుగుతాయని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ అర్చకులు రాంప్రసాద్‌శర్మ తెలిపారు. 3వ తేదీ బుధవారం విఘ్నేశ్వర పూజ, యాగశాల సంస్కారం, 4వ తేదీ గురువారం యంత్రాభిషేకం, రుద్రహోమం, 5వ తేదీ ఉదయం 10.42 గంటలకు యంత్ర స్థాపన, విగ్రహ, ధ్వజ స్తంభ, శిఖర, కలశ, బలిపీఠం, ఆదిగణపతి, అంత్య మారుతి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన



సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం టౌన్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి మంగళవారం స్థానిక కంభం రోడ్డులోని సిఫాని బజారులో రూ.5 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణమంతా సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి షంషీర్ అలీబేగ్, రాష్ట్ర ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ డైరెక్టర్ మేడా బద్రినాథ్, కౌన్సిలర్లు సలీం, భాను, మయూరి కాశిం, పార్టీ ప్రధాన కార్యదర్శి పత్తి రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు ఆకర్షితులు కావొద్దు

చినగంజాం: గంజాయి, హెరాయిన్ వంటి మాదక ద్రవ్యాలు పట్ల యువత ఆకర్షితులు కావద్దని అవి భవిష్యత్‌ను నాశనం చేస్తాయని ఎస్సై కే సురేష్ అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన చిన గంజాం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆయన యువతను ఉద్దేశించి మాట్లాడారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాలు యువతను పక్కదారి పట్టిస్తున్నాయని, యువతలో ఉన్న అభివృద్ధి ఆలోచనలను మాదక ద్రవ్యాలు అణగార్చేందుకు దోహదం అవుతాయన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

ఆరోగ్యంపై ప్రభావం చూపనున్న పొగాకు



మాట్లాడుతున్న రాజేశ్వరి

కొమరోలు: పొగాకు వినియోగం ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని జిల్లా కమ్యూనిటీ హెల్త్ మొబలైజర్ డి.రాజేశ్వరి పేర్కొన్నారు. కొమరోలు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు మంగళవారం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం 2004లో పొగాకు వినియోగం మూలంగా 5.4 మిలియన్ మరణాలు సంభవించాయన్నారు. బాలలు ఇప్పటి నుంచే ఈ విషయాన్ని తెలుసుకోవాలని, పొగాకు వినియోగం నివారించాలని సూచించారు. ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ చైతన్య దీపక్ పాల్గొన్నారు.

అవ్వ తాతలకు కంటి వెలుగు

మద్దిపాడు: మండల కేంద్రం మద్దిపాడు పీహెచ్‌సీ ఆస్పత్రి డాక్టర్లు మానస, ఆనందమోహన్ ఆప్తాల్మిక్ ఆఫీసర్ జయరాజ్‌ల ఆధ్వర్యంలో డాక్టర్ వైఎస్ఆర్ కంటి వెలుగు పథకంలో భాగంగా మంగళవారం 51 మందికి కంటి ఆపరేషన్ల నిమిత్తం గుంటూరు శంకర నేత్రాలయకు రోగులను తరలించారు. ఆస్పత్రి సిబ్బంది అందించిన సమాచారం మేరకు రెండు నెలలుగా 300కి పైగా కంటి పరీక్షలు నిర్వహించి వారిలో ఆపరేషన్లు అవసరమైన 54 మందిని గుర్తించారు. వారిలో ముగ్గురి ఆరోగ్య పరిస్థితి మేరకు నిలిపి వేసి మిగిలిన 51 మందిని కంటి ఆపరేషన్‌ల నిమిత్తం శంకర నేత్రాలయకు తరలించారు. వీరికి ఆపరేషన్లు నిర్వహించిన అనంతరం అక్కడి వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు ఇస్తారని, వారిని మూడో రోజు మళ్లీ తిరిగి మద్దిపాడుకు తీసుకొస్తారని జయరాజ్ తెలిపారు. అవ్వతాతలు ఈ పథకాన్ని వినియోగించుకుని ఆపరేషన్లు చేయించుకోవాల్సిందిగా కోరారు.

ఆరోగ్యశ్రీ ద్వారా 41 మందికి కంటి ఆపరేషన్‌లు

చీమకుర్తి: సంతనూతలపాడు పీహెచ్‌సీ వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో 41 మంది పేషంట్స్‌ను కంటి ఆపరేషన్ నిమిత్తం మంగళవారం గుంటూరు జిల్లా కాకాని శంకర్ కంటి ఆస్పత్రికి ప్రత్యేక బస్సులో పంపించారు. సంతనూతలపాడు, ఎండ్లూరు, మైనంపాడు, రుద్రవరం, గురవారెడ్డిపాలెం గ్రామాలలో కంటి చూపు కనిపించని వారు, కంటిలో శుక్లాలు ఏర్పడిన వారిని ముందుగా పీహెచ్‌సీకి చెందిన వైద్యసిబ్బంది గుర్తించారు. వారందరికీ ఆరోగ్యశ్రీ ద్వారా శంకర కంటి ఆస్పత్రిలో ఆపరేషన్‌లు చేయించేందుకు సంతనూతలపాడు పీహెచ్‌సీ డాక్టర్లు పి.హరిణి, నాగరాజు, సీహెచ్‌ఓ ప్రసాద్, ఆప్తాలమిక్ అధికారి శ్రీనివాసరావు, స్థానిక ఏఎన్‌ఎంల సహకారంతో వారికి కంటి ఆపరేషన్‌లు చేయించుటకు ఆరోగ్యశ్రీ ద్వారా ఏర్పాట్లు చేశారు.

ఉత్సాహంగా చెన్నకేశవుని వసంతోత్సవం



పూజలందుకుంటున్న స్వామి వారు

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్ల గ్రామంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి, పార్వతి సమేత రాజనగరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం చెన్నకేశవస్వామికి వసంతోత్సవం, దొంగలదోపు కార్యక్రమాలు ఉత్సాహంగా సాగాయి. ప్రత్యేకంగా అలంకరించిన స్వామి వారి ఉత్సవమూర్తులను పీఠంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. బుధవారం ఏకాంత సేవ కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు.

డ్రోన్‌తో సర్వే ప్రారంభం



డ్రోన్‌తో సర్వే ప్రారంభిస్తున్న తహశీల్దార్ దాసు

పుల్లలచెరువు: మండల కేంద్రంలో డ్రోన్‌తో భూ సర్వేను తహసీల్దార్ దాసు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో మూడు రోజుల పాటు డ్రోన్‌తో భూ సర్వే చేస్తారని పేర్కొన్నారు. తహశీల్దార్ దాసు మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన భూసర్వేతో గ్రామాల్లో భూ సమస్యలు తగ్గే అవకాశం ఉందని, భూసర్వే నిర్వహించిన తర్వాత రైతులకు శాశ్వత భూ హక్కు పత్రాలు ఇస్తామని పేర్కొన్నారు. రైతులు భూసర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. సర్వేయర్‌లు నాయక్, రాజశేఖర్‌లు, వీఆర్వో వెంకట సుబ్బయ్య, రైతు సంఘ నాయకులు జానకి రఘు, కాశయ్య, ప్రసాద్, మంగె నాయక్, మూర్తెయ్య పాల్గొన్నారు.

ఉదయం ఎండ.. సాయంత్రం వాన..



మధ్యాహ్నం ఇలా..



సాయంత్రం ఇలా..

మార్కాపురం: గత మూడు రోజుల నుంచి మార్కాపురం ప్రాంతంలో విచిత్రమైన పరిస్థితి నెలకొంది. మే నెలలో సాధారణంగా 40 నుంచి 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదవుతుంది. గత నాలుగు రోజుల నుంచి మాత్రం పగటి పూట 32, 33 డిగ్రీలు మాత్రమే నమోదవుతూ, మధ్యాహ్నం 3 గంటల నుంచి ఎండ తీవ్రత పూర్తిగా తగ్గి ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతోంది. వాతవరణంలో మార్పుల కారణంగా మండు వేసవిలోనూ సాయంత్రం పూట చల్లని వాతావరణాన్ని ప్రజలు ఆస్వాదిస్తున్నారు. గత 15 ఏళ్ల కాలంలో వేసవిలో సాయంత్రం వేళ చల్లటి వాతావరణాన్ని ఎప్పుడు చూడలేదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి



పతాకావిష్కరణ చేస్తున్న ఆశా కార్యకర్తలు

కురిచేడు: స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.2 లక్షలు ఇవ్వాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.నాగమల్లేశ్వరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మేడే వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ పతాకాన్ని సీనియర్ కార్యకర్త వెంకటలక్ష్మి ఎగురవేశారు. వేమా యోగేశ్వరమ్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో నాగమల్లేశ్వరి మాట్లాడారు. ఆశా వర్కర్లకు పనిభారం తగ్గించాలని, ప్రభుత్వం పథకాలు అమలు చేయాలని కోరారు. యూనియన్ మండల అధ్యక్షురాలు కొండమ్మ మాట్లాడుతూ రిటైర్మెంట్ 62 ఏళ్లకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. మండల నాయకులు సుకన్య, లక్ష్మి, కృపమ్మ, సుగుణకుమారి, కమలమేరి, అనూరాధ, మాధవి, ఎస్‌కే మాబులా, నాగమణి పాల్గొన్నారు.